క్లుప్తంగా

శానిటేషన్ ఆయాల వేతనాలు చెల్లించాలి



ఇబ్రహీంపట్నం: ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేస్తున్న శానిటేషన్ ఆయాలు, నైట్ వాచ్‌మెన్‌ల ఐదు నెలల పెండింగ్ వేతనాలు చెల్లించాలని సీఐటీయూ మండల కార్యదర్శి ఎం.మహేష్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. స్థానిక సీఐటీయూ కార్యాలయంలో శనివారం జరిగిన శానిటేషన్ ఆయాల యూనియన్ సర్వసభ్య సమావేశంలో ఆయన మాట్లాడుతూ నెల నెలా వేతనాలు అందకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. అనంతరం యూనియన్ నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షురాలిగా పత్తిపాటి సుజాత, ప్రధాన కార్యదర్శిగా శ్రీరామ వెంకట రమణ, కోశాధికారి ముత్యాల లక్ష్మీతోపాటు కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు.

మల్లాదికి పురస్కారం

మైలవరం: రెడ్డిగూడెం గ్రామానికి చెందిన సామాజిక సేవకుడు మల్లాది ప్రసాదరావుకు ప్రజా గాయకుడు గద్దర్ జాతీయ సేవా పురస్కార్ అవార్డు లభించింది. మానవ హక్కుల దినోత్సవాన్ని పురస్కరించుకుని మమత స్వచ్ఛంద సేవా సమితి అధ్యక్షుడు కోరుకొండ జాన్ ఆధ్వర్యంలో ఈనెల 12న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా పి. గన్నవరంలోని సాయి తేజ కళాశాలలో జరిగిన కార్యక్రమంలో ప్రసాదరావుకు అవార్డును అందజేశారు.

పైథాన్ ఫ్లాస్క్‌పై వర్క్‌షాప్

మైలవరం: మైలవరం లకిరెడ్డి బాలిరెడ్డి ఇంజినీరింగ్ కళాశాలలో ఏఐ, డీఎస్ ఆధ్వర్యంలో బిల్డింగ్ రియల్ టైమ్ వెబ్ అప్లికేషన్ యూజింగ్ పైథాన్ ఫ్లాస్క్ అంశంపై శనివారం వర్క్ షాపు నిర్వహించారు. జె. వెంకట అవినాష్ మాట్లాడుతూ కనిష్ట డిపెండెన్సీలు సరళమైన నిర్మాణాన్ని కలిగి ఉండే పైథాన్ ఫ్లాస్క్ డెవలపర్స్ తమ అప్లికేషన్స్‌ను అనవసరమైన ఓవర్‌హెడ్ లేకుండా నిర్దిష్ట అవసరాలకు అనుగుణంగా మార్చుకునేందుకు అనుమతిస్తుందని వివరించారు. హెడ్ ఆఫ్ ద డిపార్ట్‌మెంట్ డాక్టర్ ఓ. రమాదేవి, డాక్టర్ ఎస్. జయప్రద, డీన్ ఇండస్ట్రీ రిలేషన్స్ డాక్టర్ వి. సూర్యనారాయణ తదితరులు మాట్లాడారు.

లక్ష్య–2కే 25 పోస్టర్ ఆవిష్కరణ

మైలవరం లకిరెడ్డి బాలిరెడ్డి ఇంజినీరింగ్ కళాశాలలో జనవరి 25 జరగబోయే జాతీయ స్థాయి సాంకేతిక, సాంస్కృతిక ఫెస్ట్‌కు సంబంధించిన పోస్టర్‌ను కళాశాల హానరరీ చైర్మన్ లకిరెడ్డి జయప్రకాశ్‌రెడ్డి ఆవిష్కరించారు.

నాయకత్వ లక్షణాలు పెంపొందాలి

నూజివీడు: ట్రిపుల్ ఐటీలోని ఇంజినీరింగ్ విద్యార్థులు తమ కోర్సులను పూర్తి చేసుకొని ఉద్యోగాలను సాధించే క్రమంలో లీడర్‌షిప్, ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ క్వాలిటీలను పెంచుకోవాలని బొండాడ ఇంజినీరింగ్ లిమిటెడ్ అధినేత బొండాడ రాఘవేంద్రరావు పేర్కొన్నారు. ట్రిపుల్ ఐటీలో శనివారం విద్యార్థులకు స్టూడెంట్ మిత్ర ఆధ్వర్యంలో భవిష్యత్‌పై ముందుకు ఎలా సాగాలి? అంశంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు పలు సూచనలు చేశారు.

ఏఐ పాత్ర కీలకం

ఆగిరిపల్లి: ఎలక్ట్రిక్ వాహనాల తయారీ, పనితీరును మెరుగుపరచడంలో ఏఐ కీలకపాత్ర పోషిస్తోందని ఎస్‌ఆర్‌ఐ కళాశాల చైర్మన్ వెంకట్రావు అన్నారు. పోతవరప్పాడులోని ఎస్‌ఆర్‌ఐ ఇంజినీరింగ్ కళాశాలలో ఏఐసీటీఈ అటల్ ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్‌ను నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ నాగ భాస్కర్ ఎలక్ట్రిక్ వాహనాలు తయారీలో ఏఐ ప్రాముఖ్యతపై అధ్యాపకులకు అవగాహన కల్పించారు.

బైక్ అదుపు తప్పి వ్యక్తి మృతి

కొండపల్లి(ఇబ్రహీంపట్నం): బైక్ అదుపు తప్పి వ్యక్తి మృతిచెందిన ఘటన కొండపల్లి శాంతినగర్ వద్ద శనివారం జరిగింది. ఇబ్రహీంపట్నానికి చెందిన ఉప్పుతల శ్రీను(52) తన మిత్రుడి బైక్‌పై మైలవరంలో ఉన్న సోదరుడి ఇంటికి వెళ్లాడు. తిరుగు ప్రయాణంలో కొండపల్లి శాంతినగర్ వద్ద బైక్ అదుపు తప్పి హైవే మధ్య డివైడర్‌కు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో వెనుక కూర్చున్న ఉప్పుతల శ్రీను కిందపడి తీవ్ర గాయాలతో అక్కడికక్కడే మృతి చెందాడు. బైక్ నడుపుతున్న వ్యక్తికి ఎటువంటి గాయాలు కాలేదు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని విజయవాడ ప్రభుత్వ వైద్యశాలకు తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నారు.



భూమ్..భూమ్.. షకలక

- అమరావతిని ఐకాన్‌గా చూపి అక్రమ వెంచర్లు
- మైలవరం నియోజకవర్గంలో పుట్టగొడుగుల్లా అక్రమ వెంచర్లు
- అనుమతులు పొందకుండా ప్రభుత్వ ఆదాయానికి గండి
- రియల్ బూమ్ పేరుతో ఎర
- పబ్లిసిటీ మాయతో మోసం



జి.కొండూరు మండలం తెల్లదేవరపాడు గ్రామంలో అనుమతులు లేకుండా ఏర్పాటు చేస్తున్న వెంచర్



మైలవరంలో అనుమతులు లేకుండా ఏర్పాటు చేసిన వెంచర్

జి.కొండూరు: అదిగో అమరావతి. ఇదిగో ఇన్నర్ రింగ్ రోడ్డు. కూతవేటు దూరంలో విజయవాడ. పక్కనే ఔటర్ రింగ్ రోడ్డు. రియల్ భూమ్ వచ్చేసింది. రూ.లక్షలు పెట్టి కొంటే, రూ. కోట్లు మీ సొంతం. ఆలసించిన ఆశా భంగం.. అంటూ రియల్ ఎస్టేట్ వ్యాపారులు చేసే మాయాజాలం అంతా ఇంతా కాదు. భవిష్యత్ తరాల కోసం స్థిరాస్తిని కూడబెట్టుకుందామనుకుంటున్న పేద, మధ్య తరగతి ప్రజలే టార్గెట్‌గా రియల్ ఎస్టేట్ వ్యాపారుల అక్రమ దందా కొనసాగుతోంది. ఒకవైపు అనుమతులు పొందకుండా ప్రభుత్వ ఆదాయానికి గండి కొడుతున్నారు. ప్రధాన రహదారుల పక్కనే వెంచర్లు అక్రమంగా ఏర్పాటు చేస్తున్నప్పటికీ అధికారులు చోద్యం చూస్తున్నారు.

పొందాల్సిన అనుమతులు ఇవి..

- వ్యవసాయ భూమిలో వెంచర్ వేయాలంటే రెవెన్యూ శాఖకు రుసుం చెల్లించి ఆ భూమిని వ్యవసాయేతర భూమిగా మార్పు చేస్తున్నట్లు సంబంధిత ఆర్డీఓ నుంచి అనుమతి పొందాలి.
- భూమిని ప్లాట్‌లుగా విభజించే ముందు అంతర్గత రహదారులు 40 అడుగులు, ప్రధాన రహదారులు 100 అడుగుల వెడల్పుతో ఏర్పాటు చేయాలి.
- నిబంధనలకు లోబడి వెంచర్ ఏర్పాటు చేశాక అనుమతి పొందాలి.
- సీఆర్‌డీఏ పరిధిలో ఉన్న భూములకు ఆ శాఖ నుంచి అనుమతి పొందాలి.
- వెంచర్ వేస్తున్న భూమిలో సామాజిక అవసరాల కోసం ఎకరం భూమికి గాను 10 శాతం భూమి అంటే పది సెంట్ల భూమిని కామన్ సైట్‌గా కేటాయించి సంబంధిత గ్రామ పంచాయతీకి రిజిస్ట్రేషన్ చేయాలి. కామన్ సైట్ అభివృద్ధికి అయ్యే ఖర్చు కూడా రియల్ వ్యాపారే చెల్లించాలి.
- గ్రామ పంచాయతీ లేదా నగర పంచాయతీ లేదా మున్సిపల్ కార్పొరేషన్ నుంచి అనుమతి పొందాలి.
- నూతనంగా వెంచర్ వేస్తున్నప్పుడు రహదారులతో పాటు పక్కా డ్రెయినేజీలు ఏర్పాటు చేయాలి.
- వెంచర్‌కి కాంపౌండ్ వాల్ నిర్మించాలి.
- తాగునీరు, విద్యుత్ సౌకర్యం కల్పించాలి.
- పైన చెప్పిన అనుమతులతో పాటు ఏరియాను బట్టి మరికొన్ని నిబంధనలు పాటిస్తూ వంద శాతం పక్కా అనుమతులతో వెంచర్‌ని ఏర్పాటు చేసిన తర్వాతనే ప్లాట్‌లను విక్రయించాలి.

పుట్టగొడుగుల్లా వెలుస్తున్న వెంచర్లు

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి అమరావతిని ఐకాన్‌గా చూపుతూ రియల్ ఎస్టేట్ వ్యాపారులు ఎన్టీఆర్ జిల్లాలో అక్రమ వెంచర్లకు తెరలేపారు. అధికార పార్టీ నాయకుల అండదండలతో జోరుగా రియల్ ఎస్టేట్ వ్యాపారాన్ని విస్తరిస్తున్నారు. జిల్లా మొత్తం మీద వందకు పైగానే అక్రమ వెంచర్లు ఏర్పాటైనట్లు తెలుస్తోంది.

మైలవరం నియోజకవర్గంలో..

మైలవరం నియోజకవర్గంలో అక్రమ వెంచర్లకు అడ్డేలేకుండా పోయింది. మీడియాలో కథనాలు వచ్చినప్పుడు మొక్కుబడిగా అధికారులు చర్యలు తీసుకోవడం తప్ప అక్రమ వెంచర్లపై పెద్దగా దృష్టి సారించకపోవడంతో రియల్ వ్యాపారులు రెచ్చిపోతున్నారు. నియోజకవర్గంలోని మైలవరం, రెడ్డిగూడెం, జి. కొండూరు, ఇబ్రహీంపట్నం, విజయవాడ రూరల్ మండలాల పరిధిలో మండల కేంద్రాలతో పాటు పరిసర గ్రామాలలో ఇబ్బడిముబ్బడిగా వెంచర్లు వెలుస్తున్నాయి.

అక్రమ వెంచర్లపై చర్యలు చేపట్టాలి



వ్యవసాయ భూములను ల్యాండ్ కన్వర్షన్ చేయకుండా ప్లాట్‌లుగా విభజించి విక్రయిస్తున్నారు. పేద, మధ్య తరగతి ప్రజలను మోసం చేసి రియల్ ఎస్టేట్ వ్యాపారులు రూ.కోట్లు దండుకుంటున్నారు. వెంచర్లు ఏర్పాటు చేసే సమయంలో పక్కనే ఉన్న ప్రభుత్వ భూములను సైతం అక్రమించి వెంచర్లలో కలిపి అమ్మేస్తున్నారు. కనీస వసతులు, అనుమతులు లేకుండా ప్లాట్లను విక్రయించడం వల్ల కొనుగోలు చేసిన అమాయక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు వెంటనే స్పందించి అక్రమ వెంచర్లను తొలగించాలి.

– కోట కల్యాణ్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి

ధనార్జనే ధ్యేయంగా..

ధనార్జనే ధ్యేయంగా రియల్ ఎస్టేట్ వ్యాపారులు తమ అక్రమ వ్యాపారాన్ని కొనసాగిస్తున్నారు. అన్ని అనుమతులతో రియల్ ఎస్టేట్ వ్యాపారం చేయాలంటే ఖర్చుతో కూడుకున్న వ్యవహారం కనుక వ్యవసాయ భూములను నేరుగా ప్లాట్‌లుగా విడగొట్టి విక్రయిస్తున్నారు. ఏరియాను బట్టి ఒక్కొక్క ప్లాటు రూ.10 లక్షల నుంచి రూ.50 లక్షల వరకు విక్రయిస్తున్నారు. విజయవాడ కేంద్రంగా రియల్ ఎస్టేట్ కార్యాలయాలను ఏర్పాటు చేసుకొని అక్కడ పని చేస్తున్న చిరు వ్యాపారాలు, ఉద్యోగులే లక్ష్యంగా వ్యాపారం చేస్తున్నారు. పేద, మధ్య తరగతి ప్రజలే ఎక్కువగా ప్లాట్‌లు కొనుగోలు చేసేందుకు ఆసక్తి చూపుతుంటారు. ఈ క్రమంలో వారికి ఆర్థికంగా అవసరమైన బ్యాంకు లోన్లు, ప్రైవేటు ఫైనాన్స్‌లను సైతం తామే ఇప్పిస్తామంటూ కస్టమర్లకు వల వేస్తున్నారు. పండుగల ఆఫర్ల పేరుతో సమావేశాలు పెట్టి, విందు భోజనాలు ఏర్పాటు చేసి మరీ వ్యాపారాన్ని విస్తరిస్తున్నారు. ఈ విధంగా కొందరైతే కనీసం వెంచర్ ఎక్కడ ఉందో కూడా చూడకుండా విజయవాడలో రియల్ ఎస్టేట్ కార్యాలయాల్లో ఉన్న మ్యాప్‌లను చూసే ప్లాట్‌లను కొనుగోలు చేస్తున్నారు. ఈ విధంగా అనుమతులు లేకుండా ఏర్పాటు చేసిన వెంచర్లలో ప్లాట్‌లు కొనుగోలు చేసిన వారు భవిష్యత్‌లో తీవ్రంగా నష్టపోతారని రియల్ ఎస్టేట్ నిపుణులు చెబుతున్నారు.

వర్గ పోరుతో వాయిదా

- ఎమ్మెల్యే వసంత, మాజీ మంత్రి ఉమా వర్గీయుల వాగ్వాదం
- గణపవరం నీటి సంఘం ఎన్నికలో ఉద్రిక్తత
- ఎస్‌ఐ సర్దిచెప్పినా వినని ఇరువర్గాల నాయకులు
- ఎన్నిక వాయిదా వేసిన రిటర్నింగ్ అధికారి



మూలపాడులో సాగునీటి సంఘాల ఎన్నికల ప్రక్రియను పరిశీలిస్తున్న ఎంపీడీఓ సునీతశర్మ

మైలవరం: మైలవరం నియోజకవర్గం గణపవరం గ్రామంలో నీటి సంఘం ఎన్నికల్లో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. టీడీపీలోని రెండు వర్గాలు పోటీకి నిలబడి తమకే పదవులు కావాలని పట్టుపట్టాయి. ఈ నేపథ్యంలో ఇరువర్గాలు వాగ్వివాదానికి దిగడంతో ఎస్‌ఐ కల్పించుకుని వారికి సర్దిచెప్పారు. అయినా పరిస్థితి అదుపులోకి రాకపోవడంతో ఉన్నతాధికారుల సూచనల మేరకు రిటర్నింగ్ అధికారి ఎస్. ఆనందకుమారి ఎన్నికలను వాయిదా వేస్తున్నట్లు ప్రకటించారు. ఇక్కడ టీడీపీ నాయకులు రెండు వర్గాలుగా విడిపోయారు. ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాద్ వర్గానికి చెందిన నంబూరు శ్యాంప్రసాద్, వజ్రాల వెంకటేశ్వరరెడ్డి, మాజీ ఎమ్మెల్యే దేవినేని ఉమామహేశ్వరరావు వర్గానికి చెందిన అక్కల రమణారెడ్డి, ఉమ్మా వెంకట రమణారెడ్డి నీటి సంఘం పదవులు తమ వర్గానికే కావాలని పట్టుపట్టారు. శనివారం ఉదయం ఎన్నికల ప్రక్రియ ప్రారంభించిన కొద్ది సేపటికే రెండు వర్గాల నాయకులు వాగ్వాదానికి దిగారు. రిటర్నింగ్ అధికారి పలుమార్లు హెచ్చరించినా వారు స్పందించకపోవడంతో ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లారు. అప్పటికే అభ్యర్థులకు నామినేషన్ పత్రాలు ఇవ్వడంతో వారు తమ పరిస్థితి ఏమిటని ఆందోళన వ్యక్తం చేశారు.

ఓటమి భయంతోనే..

టీడీపీలో ఒక వర్గం వారు వైఎస్సార్ సీపీ అభ్యర్థులకు మద్దతు పలుకుతున్నారని, వైఎస్సార్ సీపీ అభ్యర్థులు గెలిచే అవకాశం ఉండటంతో రెండో వర్గం వారు అడ్డం తిరిగి వాగ్వాదానికి దిగారు. ఈ నేపథ్యంలో ఎస్‌ఐ కల్పించుకుని ఎన్నికలు సజావుగా జరిగేందుకు సహకరించాల్సిందిగా సూచించారు. అయినా ఇరువర్గాల మధ్య వాదోపవాదాలు జరుగుతుండటంతో ఎన్నికలను వాయిదా వేశారు. మైలవరం మండలంలోని పలు గ్రామాల్లో నీటి సంఘాల ఎన్నికలు ప్రశాంతంగా జరిగాయని తహసీల్దార్ జి. బాలకృష్ణారెడ్డి తెలిపారు. మైలవరం మండలంలో 13 మైనర్, 6 మేజర్ ఇరిగేషన్‌ల ఎన్నిక ఏకగ్రీవమైంది.

- నూజివీడు: మండలంలో శనివారం నిర్వహించిన సాగునీటి సంఘాల ఎన్నికలు ప్రశాంతంగా జరిగాయి. మొత్తం 23 చెరువులకు ఎన్నికలు నిర్వహించగా ఒక్కొక్క చెరువు కింద ఉన్న ఆరు టీసీ సభ్యుల ఎన్నిక ఏకగ్రీవంగా సాగింది. సాగునీటి సంఘాల అధ్యక్ష, ఉపాధ్యక్షుల ఎన్నిక సైతం ఏకగ్రీవంగా సాగింది. ఈ ఎన్నికలను వైఎస్సార్ సీపీ బహిష్కరించడంతో ఏకపక్షంగా సాగింది. అలాగే ఎన్నెస్పీకి చెందిన సాగునీటి వినియోగదారుల సంఘాలలోని 29 టీసీలకు సైతం ఎన్నిక ఏకగ్రీవమైంది.
- జి.కొండూరు: జి.కొండూరు మండల పరిధిలో 23 సాగునీటి సంఘాలు, 174 టీసీలకు ఎన్నికలు నిర్వహించగా అన్నీ ఏకగ్రీవమైనట్లు తహసీల్దార్ చాట్ల వెంకటేశ్వర్లు ప్రకటించారు.
- మైలవరం: రెడ్డిగూడెం మండలం రంగాపురం గ్రామ పంచాయతీ తాడిగూడెం బెడ్ డ్యామ్ (నరుకుళ్లపాడు), బూరుగుగూడెం పెద్దమ్మ చెరువు నీటి సంఘాల ఎన్నికలు ఏకగ్రీవమయ్యాయి.
- విజయవాడరూరల్: రాయనపాడు సప్లయ్ చానల్ సాగునీటి సంఘానికి, పైడూరుపాడు చెరువు సాగునీటి సంఘానికి శనివారం జరిగిన ఎన్నికలు ఏకగ్రీవమయ్యాయని ఎన్నికల రిటర్నింగ్ అధికారి తెలిపారు.
- గంపలగూడెం: గంపలగూడెం మండలంలో 23 సాగునీటి సంఘాల ఎన్నిక శనివారం ప్రశాంతంగా ముగిసింది. 15 మైనర్ ఇరిగేషన్ సాగునీటి సంఘాలు, 8 మేజర్ ఇరిగేషన్ సాగునీటి సంఘాల ఎన్నిక ఏకగ్రీవమైందని తహసీల్దార్ రాజకుమారి తెలిపారు. ఎన్నికల తీరును తిరువూరు ఆర్డీఓ కె. మాధురి పర్యవేక్షించారు.
- ఇబ్రహీంపట్నం: మండలంలో సాగునీటి సంఘాల ఎన్నికలు ఏకగ్రీవంగా జరిగాయి. ఈలప్రోలులో అధ్యక్ష, ఉపాధ్యక్షుల ఎంపిక ప్రక్రియలో కూటమి నాయకుల మధ్య కొద్దిసేపు వాగ్వివాదం జరిగింది. అనంతరం వివాదం సద్దుమణగడంతో ఏకగ్రీవమైంది.
- తిరువూరురూరల్/విస్సన్నపేట: తిరువూరు మండలం, విస్సన్నపేట మండలంలోని పలు మైనర్, మేజర్ సాగునీటి సంఘాల ఎన్నికలు ఏకగ్రీవమయ్యాయని అధికారులు తెలిపారు.

రాజీ మార్గమే రాజమార్గం

15వ అదనపు జిల్లా న్యాయమూర్తి నాగశైలజ



మాట్లాడుతున్న జడ్జి ఎ.నాగశైలజ

నూజివీడు: రాజీ మార్గమే రాజమార్గమని, క్షణికావేశంలో చేసిన తప్పులను రాజీమార్గంలో పరిష్కరించుకునేందుకే లోక్ అదాలత్ నిర్వహిస్తున్నామని 15వ అదనపు జిల్లా న్యాయమూర్తి ఎ.నాగశైలజ అన్నారు. పట్టణంలోని న్యాయస్థానాల్లో శనివారం మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో జాతీయ లోక్ అదాలత్ నిర్వహించారు. న్యాయమూర్తి మాట్లాడుతూ లోక్ అదాలత్‌లో కేసులను రాజీ చేసుకోవడం ద్వారా కక్షిదారుల సమయం, డబ్బు ఆదా అవుతుందన్నారు. 387 కేసులు పరిష్కారమయ్యాయని చెప్పారు. సీనియర్ సివిల్ జడ్జి షేక్ పెదఖాసిం, ఒకటో అదనపు జూనియర్ సివిల్ జడ్జి వి.వెంకటేశ్వరరావు, రెండో అదనపు జూనియర్ సివిల్ జడ్జి శివపార్వతి, స్పెషల్ మెజిస్ట్రేట్ వేల్పుల కృష్ణమూరి తదితరులు పాల్గొన్నారు.

- తిరువూరు: స్థానిక ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో శనివారం జాతీయ లోక్ అదాలత్ నిర్వహించారు. మండల న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి మోతీలాల్ నాయక్ ఆధ్వర్యంలో జరిగిన ఈ అదాలత్‌లో 727 క్రిమినల్ కేసులు, 12 సివిల్ కేసులను పరిష్కరించారని బార్ అసోసియేషన్ చైర్మన్ వాకదాని లక్ష్మీనారాయణ తెలిపారు.
- మైలవరం: మైలవరం జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో శనివారం జరిగిన లోక్ అదాలత్‌లో 245 కేసులు పరిష్కరించామని జడ్జి ఎం.శైలజ తెలిపారు.

ముగిసిన శిక్షణ తరగతులు

ఆగిరిపల్లి: ప్రధాన ఉపాధ్యాయులకు నిర్వహిస్తున్న శిక్షణ కార్యక్రమాలు శనివారంతో ముగిశాయి. మండలంలోని తోటపల్లి హీల్ పాఠశాలలో ఆరు రోజుల నుంచి రెసిడెన్షియల్ పద్ధతిలో ప్రధానోపాధ్యాయులకు స్కూల్ లీడర్‌షిప్‌పై శిక్షణ ఇస్తున్నారు. ఈ సందర్భంగా కృష్ణా జిల్లా అకడమిక్ మానిటరింగ్ అధికారి శ్యామసుందరరావు మాట్లాడుతూ శిక్షణ కార్యక్రమాలు ఆహ్లాదకర వాతావరణంలో జరిగాయని చెప్పారు. శిక్షణ పొందిన ఉపాధ్యాయుల తరఫున రూ. 2 లక్షలు హీల్ సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు కోనేరు సత్యప్రసాద్‌కు అందజేశారు. హీల్ సీఈఓ కూరపాటి అజయ్ కుమార్, ఆగిరిపల్లి ఎంఈఓ కొవ్వలి ఆనంద్ కుమార్ పాల్గొన్నారు.

17న సమస్యల పరిష్కార వేదిక

తిరువూరు: విద్యుత్ వినియోగదారులు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించేందుకు ఈ నెల 17న తిరువూరులో వినియోగదారుల సమస్యల పరిష్కార ఫోరం ఆధ్వర్యంలో తిరువూరులో విద్యుత్ అదాలత్, అవగాహన సదస్సు నిర్వహిస్తామని ఏపీఎస్‌పీడీసీఎల్ ఈఈ సత్యనారాయణ తెలిపారు. ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు తిరువూరు సూర్యా మినీ ఫంక్షన్ హాలులో జరిగే సదస్సుకు ఫోరం అధ్యక్షుడు విక్టర్ ఇమ్మానుయేల్, సభ్యులు, అధికారులు పాల్గొంటారన్నారు.

600 లీటర్ల బెల్లం ఊట ధ్వంసం

చాట్రాయి: ఆరుగొలను గ్రామంలో సారా తయారీ చేస్తున్నట్లు సమాచారం రావడంతో దాడి చేసి 600 లీటర్ల బెల్లం ఊటను ధ్వంసం చేసి 10 లీటర్ల సారాను స్వాధీనం చేసుకున్నట్లు నూజివీడు ఎక్సైజ్ ఎస్సై మస్తానరావు తెలిపారు. తాతకుంట్లకు చెందిన దాణావతు సతీష్‌ను అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేశారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

చాట్రాయి: ద్విచక్ర వాహనాలు ఢీ కొని వ్యక్తికి తీవ్ర గాయాలైన ఘటన సూరంపాలెంలో శనివారం చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన జక్కం రాజేష్ ఎన్టీఆర్ జిల్లా కలగర గ్రామానికి చెందిన మిద్దె వెంకటేశ్వరరావు శనివారం తమ ద్విచక్ర వాహనాలపై వస్తుండగా సూరంపాలెంలో ఢీకొన్నాయి. ఈ ఘటనలో రాజేష్‌కి తీవ్ర గాయాలు కావడంతో ప్రైవేటు వాహనం ద్వారా విజయవాడ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు.

నేడు 'భారతీయం' పుస్తకావిష్కరణ

తిరువూరు: స్థానిక జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాల ఉపాధ్యాయిని ఈడే వెంకట భరతకుమారి రాసిన 'భారతీయం' సరళ పద్యాల శతక పుస్తకావిష్కరణ కార్యక్రమం ఆదివారం జరుగుతుందని ఆహ్వాన కమిటీ తెలిపింది. తిరువూరు సత్యా బీఈడీ కళాశాల ఆవరణలో మధ్యాహ్నం 3 గంటలకు జరిగే పుస్తకావిష్కరణ కార్యక్రమంలో సీనియర్ పాత్రికేయుడు కంతేటి చంద్రప్రతాప్, తెలుగు భాషా వికాస సమితి అధ్యక్షులు తోట ఉమామహేశ్వరరావు, శాసన మండలి సభ్యులు కేఎస్ లక్ష్మణరావు తదితరులు పాల్గొంటారని చెప్పారు.

హామీల అమలులో కూటమి ప్రభుత్వం విఫలం: సీపీఐ

చాట్రాయి: ప్రజలకు ఇచ్చిన హామీలు అమలు చేయడంలో కూటమి ప్రభుత్వం విఫలమైందని సీపీఐ నాయకుడు నిమ్మగడ్డ నరసింహ విమర్శించారు. చిన్నంపేట గ్రామంలో శనివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ప్రతిపక్షాన్ని విమర్శించడం తప్ప ప్రజా పాలనపై దృష్టి పెట్టడం లేదని ధ్వజమెత్తారు. విద్యుత్ చార్జీలు పెంచమని ఎన్నికల ప్రచారంలో ఊదరగొట్టి ప్రభుత్వం ఏర్పడిన తరువాత విద్యుత్ చార్జీలు పెంచడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు.

భక్తిశ్రద్ధలతో సిందూరార్చన

మేడూరు(గంపలగూడెం): మేడూరు వీరాంజనేయ స్వామి ఆలయంలో హరే రామ నామ సప్తాహ వేడుకలు ఐదో రోజు శనివారం ఘనంగా నిర్వహించారు. స్వామివారికి ప్రత్యేక పూజలు, సింధూర అర్చన జరిపారు. మహిళలచే విష్ణు, లలిత సహస్రనామ పారాయణం నిర్వహించారు.

నేడు మధుమేహ రోగుల వైద్యశిబిరం

తిరువూరు: తిరువూరులో మధుమేహ రోగుల ప్రత్యేక వైద్యశిబిరం ఆదివారం నిర్వహిస్తామని జేవీవీ పట్టణ అధ్యక్షుడు పాపారావు తెలిపారు. తిరువూరు నాగార్జున స్కూల్ ఆవరణలో ఉదయం 5 గంటల నుంచి నిర్వహించే శిబిరంలో వైద్యపరీక్షలు చేసి అవసరమైన మందులు పంపిణీ చేస్తారన్నారు.

హైందవ శంఖారావం సభకు ఆహ్వానం

నూజివీడు: దేవాలయ నిర్వహణ వ్యవస్థ ప్రక్షాళన కోసం గన్నవరంలో జనవరి 5న నిర్వహించనున్న హైందవ శంఖారావం బహిరంగ సభలో పాల్గొనాలని రాష్ట్ర గృహ నిర్మాణ, సమాచార శాఖ మంత్రి కొలుసు పార్థసారథికి శనివారం విశ్వహిందూ పరిషత్ నాయకులు ఆహ్వానం అందజేశారు. హైందవ శంఖారావం సభ ఉద్దేశాన్ని వివరించి ఆహ్వాన పత్రాన్ని ఇచ్చారు. విశ్వ హిందూ పరిషత్ నాయకులు కస్తూరి సూర్యప్రకాష్, మేడిశెట్టి పాములు, గారపాటి సీతారామాంజనేయ చౌదరి పాల్గొన్నారు.

ఘనంగా ఇంధన పరిరక్షణ దినోత్సవం



ఇబ్రహీంపట్నం: జాతీయ ఇంధన పరిరక్షణ దినోత్సవ కార్యక్రమం ఎన్టీటీపీఎస్‌లో శనివారం ఘనంగా నిర్వహించారు. చీఫ్ ఇంజినీర్ టి.నాగరాజు కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడుతూ ఇంధన పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని అన్నారు. వనరులను కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని చెప్పారు. ఇంధన పొదుపుపై ప్రజల్లో విస్తృతంగా అవగాహన కల్పించాలన్నారు. శక్తి వినియోగం తగ్గించి దానిని సమర్థవంతంగా వినియోగించడం అలవాటు చేసుకోవాలని కోరారు. ఆర్థిక రంగంలో సరళీకృత విధానాలతో ఇంధన డిమాండ్ పెరిగిందన్నారు. డిమాండ్, సరఫరా మధ్య సమన్వయం కోసం ఇంధనాన్ని పరిరక్షించడమే ప్రస్తుత కర్తవ్యమని చెప్పారు. అనంతరం ర్యాలీ నిర్వహించారు. ఎస్ఈలు ప్రసాద్, అనూరాధ, మల్లికార్జునరావు, రమణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

రేపటి నుంచి ధనుర్మాసోత్సవాలు

గంపలగూడెం: ధనుర్మాసోత్సవాలు ఈనెల 16వ తేదీ నుంచి నిర్వహిస్తామని గంపలగూడెం రామాలయ అర్చకులు దేవయజనం శ్రీధరాచార్యులు తెలిపారు. మొదటిరోజు విష్వక్సేనపూజతో ఉత్సవాలు ప్రారంభమవుతాయి. 18న వ్రతాభివృద్ధి, తులసిదళాలు, రజిత తులసి దళాలతో అష్టోత్తర పూజ, 19న సుబ్రహ్మణ్య అభిషేకం, హోమాలు, 20న లక్ష్మీహయగ్రీవ హోమం, 21న బదరీ(రేగిపళ్ళు) ఫలాలతో అష్టోత్తర పూజ, 22న 108 కమలాపండ్లతో పూజ, 23న ద్రాక్షపండ్లతో ప్రత్యేక పూజ నిర్వహిస్తారు. ప్రతిరోజూ ప్రత్యేక పూజలు, అభిషేకాలు జరుగుతాయని వివరించారు.